క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: వార్డు శానిటరీ సెక్రటరీలు, పీహెచ్ వర్కర్లు సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామున 1వ డివిజన్ పీహెచ్ వర్కర్స్ మస్టర్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినాయకచవితి సందర్భంగా మండపాల వద్ద చెత్తా చెదారం ఎక్కువగా ఉంటుందని పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం కమిషనర్ మండీ బజార్ ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఏయే కాలనీలకు నీటి సరఫరా చేయనున్నారు? మోటార్ల పనితీరుపై సిబ్బందిని ఆరాతీశారు. డీఈ రామ్మూర్తి ఉన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం విజయమ్మ

యాడికి: జిల్లాస్థాయిలో ఈ నెల 17న జరిగిన యోగా పోటీల్లో యాడికి ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం విజయమ్మ తెలిపారు. మంగళవారం పాఠశాలలో పోటీలకు ఎంపికైన విద్యార్థులు వెంకటకృష్ణ, గోవర్ధన్‌కు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో పీడీ ఓబుళమ్మ, యోగా ఉపాధ్యాయుడు నరేంద్ర పాల్గొన్నారు.

కోర్టులో సెక్యూరిటీ ఆడిట్

తాడిపత్రి అర్బన్: స్థానిక కోర్టులో పోలీసు అధికారులు సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. డీఎస్పీ సీఎం గంగయ్య, సీఐ హమీద్‌ఖాన్, ఎస్ఐ ధరణీబాబుతో కలిసి కోర్టు భద్రతా ప్రమాణాలపై అక్కడున్న సిబ్బందితో ఆరా తీశారు. కోర్టు భవనానికి ఎన్ని సీసీ కెమెరాలు అవసరం, ఫిజికల్ చెకింగ్ పాయింట్లు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. న్యాయస్థానాల భద్రతా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడం కోసం ఆడిట్ నిర్వహించామని డీఎస్పీ తెలిపారు.

గార్లదిన్నెలో పట్టపగలే చోరీ



బైక్‌పై పరారవుతున్న నిందితులు

గార్లదిన్నె: మండల కేంద్రంలో పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు.. స్థానిక బస్టాండ్ సర్కిల్ సమీపంలో రాఘవాచారి అనే వ్యక్తి బంగారు షాపు నిర్వహిస్తుండేవాడు. మంగళవారం టీవీఎస్ ఎక్సెల్‌లో బంగారు , వెండి ఆభరణాలు ఉన్న బ్యాగు తీసుకొని షాపు వద్దకు వచ్చాడు. ఆభరణాలు ఉన్న బ్యాగు వాహనం ముందుంచి షాపు తాళాలు తీయడానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన ఇద్దరు దొంగలు ఆభరణాల బ్యాగుతో పల్సర్‌పై ఉడాయించారు. సీఐ అస్రార్‌బాషా ఘటనపై ఆరా తీయడంతోపాటు సీసీకెమెరా ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపట్టారు. బాధితుడి సెల్‌ఫోన్లు బ్యాగులోనే ఉండటంతో టవర్ లోకేషన్ పెట్టారు. అనంతపురం పోలీసులు కళ్యాణదుర్గం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పసుసు పచ్చని పల్సర్‌లో ఉన్న దొంగలు బళ్లారి వైపు పరారయ్యారు. దుండగులను పట్టుకునేందుకు 3 బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం



మాట్లాడుతున్న సుధారాణి

శింగనమల: నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామని నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధారాణి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటర్లకు సంబంధించిన ఫిర్యాదుల్లో డెత్ కేసులకు ఆయా క్లెయిమ్స్‌లకు సంబంధించి ఫారాలను సేకరించి , ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని నెలాఖరు లోపు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఈడీటీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దండాలయ్యా...ఉండ్రాళ్లయ్యా

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు



గుంతకల్లు: వాసవీ ఆలయంలో కొలువుదీరిన వెండి వినాయకుడు



గుంతకల్లులో చంద్రయాన్-3 రూపంలో వినాయకుడు



గార్లదిన్నె: యర్రగుంట్లలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

గుంతకల్లు: వినాయక చవితి పండుగను నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి వాడలో వినాయక ప్రతిమలు కొలువుదీర్చి జై బోలో గణేష మహారాజ్ అంటూ నినాదించారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 700 పైగా వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించిన వెండి గణనాథుడు విశేష పూజలందుకున్నారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా వెండి విగ్రహదాత పువ్వాడి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా ప్రథమ పూజలు చేయించారు. సాయంత్రం అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి వెండి వినాయక విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. మంగళవారం ఆలయంలో వేదపండితులు ఆధ్వర్యంలో గణపతి, రుద్ర, వాస్తు, పురుష హోమలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వేలం పాటులో వెండి కాయిన్‌ను వల్లకొండ మంజునాథ్ రూ.44 వేలుకు, బెల్లకొండ అచ్యుత్ లడ్డును రూ.16 వేలుకు దక్కించుకున్నారు. పట్టణంలో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణపతి ప్రతిమలు విశేషంగా ఆకర్షించాయి. ఇక 25వ వార్డులో పవర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల విజేతలకు ఇండియన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.యశోద బహుమతులను అందజేశారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా గణనాథులు సోమవారం కొలువుదీరారు. రక రకాల గణనాథులను మండపాల్లో ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. పోలీసులు, అధికారులు చీమలువాగుపల్లి కుంటలో వినాయకుల నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.

యల్లనూరు: మండల వ్యాప్తంగా గణనాథులు కొలువుదీరారు. వినాయక మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గుంతకల్లు రూరల్: వినాయక చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల వ్యాప్తంగా ప్రజలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంజీవనగర్ కాలనీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రజతోత్సవాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇక కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని యాగశాలలో వినాయకుడిని కొలువుదీర్చి పూజలు చేపట్టారు. అనంతరం గణపతి ఉపనిషత్తు హోమం నిర్వహించారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని కర్నూలు రోడ్డులో వినాయక విగ్రహం ఏర్పాటు ప్రాంతంలో సోమవారం రాత్రి భరత, కూచిపూడి నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, డాక్టర్ శాంతి ప్రియ, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నేత శిరీష బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పట్టణంలోని కోట నేసే వీధిలో నృత్యపోటీలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, యువ నాయకుడు షఫి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని రైల్వేగ్రౌండ్, వీవీ.నగర్, పాతగుత్తి రోడ్లలోని వినాయకుడి ఆలయాలతో పాటు వివిధ కాలనీల్లో కొలువుదీర్చిన గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పామిడి: మండలంలో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో పోటాపోటీగా బొజ్జ గణపయ్య విగ్రహాలను ఏర్పాటు చేశారు. స్థానిక పెద్ద విఠోబ దేవాలయం వద్ద భారీ వినాయక ప్రతిమ, తగ్గదేవాలయంలో శివాజీ, చాక్లెట్లతో తయారు చేసిన గణేషుని ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వినాయక మండపాల్లో వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

యాడికి: వినాయక నిమజ్జనంలో ప్రతి ఒక్కరూ పోలీసుల నియమాలను పాటించాలని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య కోరారు. మంగళవారం ఆయన సాయంత్రం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలిసి మోడల్ స్కూల్ వద్దనున్న వంకను పరిశీలించారు. నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. ఏఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు.

తాడిపత్రి అర్బన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వాడ వాడలా వినూత్న రీతిలో, విభిన్న ఆకృతుల్లో గణనాథులు కొలువుదీరారు. స్థానిక గాంధీకట్ట వద్ద గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో వీహెచ్‌పీ, బీజేపీ నేతృత్వంలో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శింగనమల: మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తరిమెల గ్రామంలో వినాయకుడికి జెడ్పీటీసీ సభ్యురాలు కంచిరెడ్డి సుధ ప్రత్యేక పూజలు చేశారు. శింగనమలలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద , వాల్మీకి వీధి, గోవింద రాయునిపేట, హమాలీకాలనీలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా సోమవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 130 చోట్ల వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. నిర్వాహకులు వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మంటపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: మండలంలో వినాయక చవితి వేడుకలును ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని పోతులయ్య వీధి, బోయవీధి, పెద్దమ్మ, వీధి, బస్టాండ్ల వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి. భక్తులు స్వాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు.



యల్లనూరు: చింతకాయ మందలో కొలువు దీరిన వినాయకుడు



సంజీవనగర్‌లో పూజల్లో పాల్గొన్న యువత



గుంతకల్లుటౌన్: క్రాస్‌థియేటర్ వద్ద సూర్యభగవానుడి రూపంలో గణపతి



బీకేఎస్‌లో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



యాడికి : దుర్గమ్మ వాటర్ ప్లాంట్ వద్ద కొలువైన వినాయకుడు



తాడిపత్రి అర్బన్ :కేవీరెడ్డి నగర్‌లో గణనాథుడు



పెద్దవడుగూరులో కొలువైన భారీ వినాయకుడు



పామిడిలో కొలువైన చాక్లెట్ వినాయకుడు



పెద్దపప్పూరులో కొలువుదీరిన గణపయ్య



తాడిపత్రి అర్బన్ : వినాయక కాంప్లెక్స్‌లో నెమలి పింఛాలతో వినాయకుడు



తాడిపత్రి అర్బన్ :పుట్లూరు రోడ్డులో వినాయకుడు



తరిమెలలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సుధ

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై సోమవారం బైక్‌పై నుంచి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మామిళ్లపల్లికి చెందిన వెంకటరాముడు, జయమ్మ దంపతులు మనవరాలు సాత్వికతో కలిసి బైక్‌పై పందికుంటకు వెళ్లి తిరుగుపయనమయ్యారు. గుత్తి శివారులో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. వెంకటరాముడు, జయమ్మకు తీవ్రగాయాలయ్యాయి. సాత్విక స్వల్ప గాయాలతో బయటపడింది. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు.

ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన ఆంజనేయులు గుత్తిలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని తాడిపత్రి రోడ్డుపై రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు.

పెద్దవడుగూరు: లక్షుంపల్లి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..లక్షుంపల్లికి చెందిన పెద్దన్న బైక్‌పై కుటుంబ సభ్యులతో కలిసి పెద్దవడుగూరుకు బయలుదేరాడు. గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన పెద్దన్నను 108లో అనంతపురం తరలించారు.

ఒకే నెలలో మూడుసార్లు హుండీ నగదు చోరీ

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సెప్టెంబర్‌లోనే కృష్ణారెడ్డి మూడు సార్లు హుండీ నగదు చోరీ చేశాడని, ఈ విషయం సీసీ ఫుటేజీల పరిశీలనలో బయటపడిందని పాలకమండలి సభ్యులు తెలిపారు. మంగళవారం దేవస్థానం ఈవో కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18వ తేదీతో పాటు 7న, 12న చోరీ చేశాడన్నారు. కృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారన్నారు. పాలకమండలి సభ్యులు పాటిల్ మల్లికార్జున రెడ్డి, లోకనాథ్ శర్మ, మంతాజీ త్యాగరాజు, గణపర ప్రసాద్, పాటిల్ రవిచంద్రారెడ్డి, గంతుల రామాంజనేయులు తదితరులు మాట్లాడారు.

గుంతకల్లుటౌన్: కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ హుండీల్లోని డబ్బును చోరీ చేస్తూ పట్టుబడిన ఆలయ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణారెడ్డిని శిక్షించాలని వీహెచ్‌పీ రాష్ట్ర సేవాప్రముఖ్ డాక్టర్ రామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ గద్వాల్ ప్రతాప్, బండిమురళీ, గాజుల పవన్, శ్రీనివాసులు, రమేష్, హరి పాల్గొన్నారు.

కృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ నగదును చోరీ చేసిన కృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగదళ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆలయ ఈఓ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి ఘటనపై నిలదీశారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇంత ధైర్యంగా చోరీ జరుగుతుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ ఘటనపై విచారణ చేపట్టాలన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.18,870 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప



పెద్దవడుగూరు : వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ సీఎం గంగయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిద్దామని డీఎస్పీ నరసింగప్ప, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో వినాయక నిమజ్జనం నిర్వహణపై అధికారులు, నగర ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు, వివిధ మతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వినాయక విగ్రహాల శోభాయాత్ర రైల్వే గ్రౌండ్ నుంచి ప్రారంభమవుతుందని డీఎస్పీ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి ఎన్‌హెచ్–67 మీదుగా గుత్తి వైపునకు వెళ్లే వాహనాలను వజ్రకరూరు, పామిడి మీదుగా మళ్లిస్తామన్నారు. గుత్తి నుంచి గుంతకల్లు వైపు వచ్చే వాహనాలను గుంతకల్లు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపివేస్తామన్నారు. తహసీల్దార్ రాము, టూటౌన్ సీఐ గణేష్ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: గణేశ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్ నిమజ్జనంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్‌కు విగ్రహాలన్నీ చేరుకోవాలని అక్కడి నుంచి గణేషుని శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ కాలుష్యం దృష్ట్యా నిమజ్జనంలో రంగులు నిషేధించామన్నారు. దుకాణాల్లో ఎవరైనా రంగులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సాయంత్రం 6గంటల కల్లా నిమజ్జనం పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. వినాయక కేంద్ర కమిటీ నిర్వాహకులు కత్తి రామచంద్రారెడ్డి, వీహెచ్‌పీ నేత వెంకట్రామిరెడ్డి, ఏబీవీపీ నేత గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వినాయక మండపాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దవడుగూరులో వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు. డీఎస్పీ సూచన మేరకు పోలీసులు పెద్దవంక ప్రాంతంలో కంపచెట్లు తొలగించారు.

గుత్తి రూరల్: మండలంలో గణేష్ నిమజ్జనానికి పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తురకపల్లి గ్రామ శివారులో వినాయక నిమజ్జన ఘాట్‌ను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నేత, మణికంఠ మెటల్ స్టోన్ క్రషర్స్ అధినేత మధుసూదన్‌రెడ్డి తన సొంత ఖర్చుతో టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించి జేసీబీతో చదును చేయించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ న్యాయం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



కల్లుమడిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రజలందరికీ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం కల్లుమడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని పురాతన చెన్నకేశవాలయంలో పూజలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. గ్రామంలో సీసీరోడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరగా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గంథంలా భావించి, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారన్నారు. కుల,మత, పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేని ప్రతిపక్షాలు ఆయనపై బురదజల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్నను మరోమారు సీఎం గా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎండీసీ రాష్ట్ర డైరెక్టర్ జయసుధ, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, సర్పంచ్ పక్కీరమ్మ, ఎంపీటీసీ నల్లప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండయ్య, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

పామిడి: ఎగువపల్లి రమేష్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో తమ నాయకులపై పామిడి బట్టి సూరి, ఎగువపల్లి రమేష్ విమర్శలు చేసుకున్నారన్నారు. ఈక్రమంలోనే రమేష్‌పై దాడి జరిగిందని, దీనిపై పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారన్నారు. బట్టి సూరీ అలియాస్ నక్కా సూర్యనారాయణతో పాటు ఆయన వర్గీయులు పీ రూపేంద్రసాయి, నక్కా నారాయణ స్వామి, నక్కా చిన్న ఓబులేసు, నక్కా లోకేష్‌ను అరెస్ట్ చేసి గుత్తి కోర్టుకు హాజరు పరిచామన్నారు. దాడి ఘటనలో కానిస్టేబుల్ రవి పాత్రపై విచారణ జరుగుతోందని, ఇందులో అతడి పాత్ర ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

గుంతకల్లు రూరల్: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాని కోరారు.